RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 243 పేజీలు - 08 బుధవారం 29 జూలై 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## ప్రశ్నపత్రాల లీకేజీలకు కారకులను
# కఠినంగా శిక్షించాలి

- అప్పట్లో గ్లోబరీనాపై చర్యలు తీసుకోకపోవడంతో సమస్య
- గ్లోబరీనా అక్రమాలు సీబీఎస్ఈకీ విస్తరించాయి
- కేసీఆర్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు
- ఇకనుంచి సకాలంలో ఫీజుల చెల్లింపునకు చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 28 :** ప్రశ్నపత్రాల లీకేజీలకు కారణమైన వాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి .రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతు న్నాయని సీఎం విమర్శించారు. ఈ విషయంలోజాతీయస్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని సీఎం అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్రం మానుకోవాలని సీఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందని, ఈ అంశంపై పార్లమెంట్ చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపై మాట్లాడతారని సీఎం తెలిపారు. ప్రశ్నాపత్రాలలీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని మిగతా2లో...




## హామీల అమలులో
# కమిటీలదే కీలక పాత్ర

- హామీలు అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత వారితే
- హామీల అమలు కమిటీల సమావేశంలో స్పీకర్ ప్రసాద్ కుమార్

2లో

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్






## నిరసనకారులపై
# చర్యలు వద్దు

- మైనర్లు, నేరచరిత లేని వారిని వదిలేయండి
- విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశం

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 28 :** పరీక్ష పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో అరెస్టయిన విద్యార్థుల విషయంలో సుప్రీంకోర్టు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. 18 ఏళ్లలోపు మైనర్లు, అలాగే ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి, వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం తన తాత్కాలిక ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశంపై దేశవ్యాప్తంగా సాగిన నిరసనల సమయంలో, విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, దౌర్జన్యాలపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటనలకు మిగతా2లో...




## రైతుకు సాంకేతికత చేరవేయడమే లక్ష్యం

- వందఎపిసోడ్లు పూర్తి చేసుకున్న రైతునేస్తం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 28 :** రైతు చెంతకు నూతన సాంకేతికతే 'రైతునేస్తం' లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మిగతా2లో...

# పరీక్షల సంస్కరణల బిల్లుకు మద్దతు ఇస్తాం

- గతంలో జరిగిన తప్పులపై వివరణ ఇవ్వాల్సిందే
- మహిళా బిల్లుతో డీలిమిటేషన్ చేర్చి గందరగోళం చేస్తున్నారు
- అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తాం
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 28 :** మంచి ఉద్దేశంతో పరీక్షల సంస్కరణల బిల్లు తీసుకొస్తే బీఆర్ఎస్ మద్దతు ఇచ్చి స్వాగతి స్తుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొత్త బిల్లులు తీసుకు రావడానికి ముందు గత తప్పుల నుంచి ఏమి నేర్చుకుందో ప్రజలకు చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఐదుసార్లు పేపర్ లీక్‌లు జరిగాయని.. అందులో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా మూడుసార్లు జరిగాయని మిగతా2లో...



# లీక్ నిందితుల్ని శిక్షించాలి

- కోచింగ్ సెంటర్లపై దేశవ్యాప్త విధానం ఉండాలి
- యూనివర్సిటీలపై కేంద్రం ఆధిపత్యం వద్దు
- 'విద్య' రాష్ట్రాల పరిధిలోనే ఉండాలి
- కేంద్రం దాన్ని గుంజుకునే ప్రయత్నాలు మానాలి
- అధికారుల నియామకం రాష్ట్ర ప్రభుత్వ విచక్షణాధికారం
- ఢిల్లీలో మీడియాతో సీఎం ఏ రేవంత్ రెడ్డి
- 11.56 లక్షల ఇండ్లు ఇవ్వండి
- వీబీ గ్రామ్‌జీలో పది కొత్త పనులు చేర్చండి : కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో భేటీలో సీఎం విజ్ఞప్తి



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 28 :** ప్రశ్న పత్రాల లీకేజీలకు కారణమైనవాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్య లు లేవని, ఆఫ్‌లైన్ లోనే సమస్యలు వస్తున్నాయని అభిప్రాయ పడ్డారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం అక్కడే ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా యని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతున్నాయని చెప్పారు. దీనిపై జాతీయ స్థాయిలో ఒక విధానాన్ని మిగతా2లో...

## భవిష్యత్‌లో పేపర్ లీకులకు
# అడ్డుకట్ట

- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్
- లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు..పది కోట్ల జరిమానా
- గతంలో లీకులు జరిగినా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు
- లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్






## భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో
# రీ-సర్వే కీలక ఘట్టం

- ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి
- రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- నిర్ధేశిరచిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 28 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ మిగతా2లో...

# ప్రశ్నపత్రాల లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

(మొదటి పేజీ తరువాయి)

చూసి తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలనేదిచూస్తామని సీఎం ఒక ప్రశ్నకుబదులిచ్చారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతోనే తాము పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని సీఎం తెలిపారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. గ్లోబరీనావటి సంస్థలు నాడు అక్రమాలకు పాల్పడినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో వాళ్లు సీబీఎస్ఈ పరీక్షలవరకు విస్తరించి, వాటిని గందరగోళంచేశారని సీఎం విమర్శించారు. ఇలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనుల విషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలోపరిస్థితుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు సీఎం తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ కు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం రూ.8వేల కోట్లను బకాయిలను పెట్టి పోయిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్‌కొట్టేయాలనుకునే సంస్థలమీద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని సీఎం తెలిపారు. సక్రమంగా ఉన్న వాళ్లకు బకాయిలుచెల్లిస్తామని ఓ ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, మా ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీవంతపాడుతోందని సీఎం మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు బకాయిలపై బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎందుకు మాట్లాడడం లేదని సీఎం ప్రశ్నించారు. కూటమిప్రభుత్వం ఉన్న ఏపీలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలకు సూచిస్తున్ ట్లు సీఎం తెలిపారు. గత ప్రభుత్వం బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని సీఎం అన్నారు. భవిష్యత్తులో ఏ సంవత్సరానికి సంబంధించిన ఫీజుల మొత్తం అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని, అడ్వాన్స్‌డ్‌గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ.2,200 నుంచి రూ.2,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కుఅవసరమవుతాయని సీఎం అన్నారు. క్రమంతప్పకుండా వాటిని చెల్లించేందుకు తమప్రభుత్వం ప్రణాళికలు రచించుకుందని, భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య రాష్ట్రంలో ఉండదని సీఎం స్పష్టం చేశారు.

# హామీల అమలులో కమిటీలదే కీలక పాత్ర

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 28:** పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ హామీల అమలు కమిటీల పాత్ర చాలా గొప్పదని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శాసనసభ సమావేశాల సందర్భంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విదంగా చూడాల్సిన బాధ్యత హామీల కమిటీదని అన్నారు. ఆవిధంగా పనిచేయా లని సూచిస్తున్నాను. నియామాల కమిటీ శాసనసభ సక్రమమైన, సమర్ధవంతమైన ,ప్రజాస్వామ్య బద్ధమైన నిర్వాహణలో అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తుం దన్నారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో మంగళవారం శాసనసభ ప్రభుత్వ హామీల అమలు కమిటీ , శాసనసభ యొక్క నియమాల కమిటీ , శాసనసభ యొక్క నైతిక విలువల కమిటీల ప్రారంభ సమావేశం జరిగింది.

శాసన సభాపతిగడ్డం ప్రసాద్ కుమార్ , శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, శాసనసభ హామీల అమలు కమిటీ చైర్మన్ పటోళ్ల సంజీవరెడ్డి, సభ్యులు జె. అనిరుధ్ రెడ్డి, జారే ఆదినారాయణలు హాజరయ్యారు.

రూల్స్ కమిటీ సమావేశానికి కమిటీ సభ్యులు దానం నాగేందర్, తూడి మెఘారెడ్డి, భూక్యా మురళి నాయక్, హాజరయ్యారు.

శాసనసభ నైతిక విలువల కమిటీ చైర్మన్ రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి ,కౌన్సిల్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి పాల్గొన్నారు.

రాగద్వేషాలకు అతీతంగా, నిష్పక్షపాతంగా కమిటీలు పనిచేయాలి. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ...శాసనసభలో సభ్యులకు మొదటిగా ఇచ్చేది రూల్స్ బుక్, దానికి అనుగుణంగా స్పీకర్ శాసనసభను నడుపుతారని అన్నారు. సభలో నియమాలను పాటించే విదంగా చూడడంతో పాటుగా, సభ హుందాతనాన్ని కాపాడడంలో విలువల కమిటీది కీలక పాత్ర అన్నారు.

# లీక్ నిందితుల్ని శిక్షించాలి

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని హెచ్చరించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందనీ, దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపై మాట్లాడతారని తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసిన తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామన్నారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడం వల్లే తాము రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని వివరించారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో ఇంటర్ సహా పలు పరీక్షా పేపర్ల లీకేజీలతో సంబంధం ఉన్న గ్లోబరీనా వంటి సంస్థలపై ఆనాటి సీఎం కేసీఆర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదనీ, దాని ఫలితంగా ఇప్పుడు ఆ అక్రమాలు సీబీఎస్ఈ పరీక్షల వరకు విస్తరించాయని విమర్శించారు. అలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

**క్షేత్రస్థాయి పరిశీలనకు రండి : కేంద్ర మంత్రికి సీఎం ఆహ్వానం**

ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనుల విషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో పరిస్థితుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని తాను కేంద్ర మంత్రిని ఆహ్వానించానని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కు సంబంధించి గత కేసీఆర్ ప్రభుత్వం రూ.8వేల కోట్లను బకాయిలను పెట్టి పోయిందని తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలనుకునే సంస్థలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని తెలిపారు. సక్రమంగా ఉన్నవాళ్లకు బకాయిలు చెల్లిస్తామని ఓ ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, తమ ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీ వంతపాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.**ఏపీలో కోరండి** కూటమి ప్రభుత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కే రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గత ప్రభుత్వ బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యల్ని పరిష్కరించే ప్రయత్నం.

## పరీక్షల సంస్కరణల బిల్లుకు మద్దతు ఇస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. ప్రస్తుతం దేశానికి జవాబుదారీతనం, పారదర్శకత , దీర్ఘకాలిక సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. డా. కె. రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సుల అమలు ఏమైందో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే నందన్ నీలేకని కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికే పార్లమెంట్ ఆమోదించింది.. అయితే దానిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టి రాజకీయ గందరగోళం సృష్టించారని విమర్శించారు. డీలిమిటేషన్‌పై ఇప్పటివరకు ప్రభుత్వం ప్రత్యేక బిల్లు తీసుకు రాలేదని వివరించారు. అందుకు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ఉదాహరణ అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో లోక్‌సభ స్థానాలు పెంచాలని చట్టంలో ఉన్నప్పటికీ, 12 ఏళ్లుగా అవి అమలు కాలేదన్నారు. పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్నే అమలు చేయని ప్రభుత్వం.. కొత్త హామీలను ప్రజలు ఎలా నమ్ముతారని సందేహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి జనాభా లెక్కల తర్వాత లోక్‌సభ స్థానాల పునర్విభజన జరగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 1971 జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్‌ను నిలిపివేసి, ఆ తర్వాత వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ఆ గడువును పొడిగించిందని వివరించారు. ఈ కాలంలో దక్షిణ భారత రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని.. కానీ ఉత్తర భారతంలోని రాష్ట్రాల్లో జనాభా అధికంగా పెరిగిందని సోదాహరణగా తెలిపారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా స్పష్టత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈసందర్భంగా కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరుడి ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో ఉంటది. దాన్ని హైడ్రా ముట్టదు. రాష్ట్ర మంత్రులు వివేక్, శాసనమండలి చైర్మన్ గుత్తు సుఖేందర్ రెడ్డి, రాష్ట్రంలో ఇంకా కీలక నేతలు చాలా మంది బిల్డింగులన్నీ చెరువుల్లో, శిఖాల్లో ఉన్న వాటిని మాత్రం హైడ్రా ముట్టదని కేటీఆర్ అన్నారు. కబ్జాకోరులని ముఖ్యమంత్రి అంటున్నరు. అందరికంటే పెద్ద కబ్జాకోరులే మీ అన్నదమ్ములు కదా.. అందరికంటే ఎక్కువ ఆస్తి దోస్తున్నది.. అందరికంటే ఎక్కువ విధ్వంసం చేస్తున్నది మీ మంత్రులు కదా..? కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టింది నీ మంత్రులు కాదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయిన నాడు రాష్ట్రంలో నిషేధిత భూముల ఎంతంటే మొత్తం 16 లక్షల ఎకరాలు.. ఇవాళ అది కోటి ఎకరాలకు చేరుకుంది. ఏ కారణం చేత కోటి ఎకరాలు పెడుతున్నరు. 30 శాతం కమిషన్ తీసుకోవడం లేదా..? మీ మంత్రులు.. అని ప్రశ్నించారు.

## భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 28:** భవిష్యత్‌లో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనూ ఆర్‌ఆర్‌బీ పేపర్ లీక్ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నోసార్లు పరీక్షా పత్రాలు లీకయ్యాయని మండిపడ్డారు.

అయితే పరీక్షల నిర్వహణలో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని తెలిపారు. 2010లో ఎన్‌టిఎ ఏర్పాటు విజ్ఞప్తిని కాంగ్రెస్ పట్టించుకోలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ల లీకులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. అందుకోసం 2024 నాటి ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి పేపర్ లీక్ నిరోధక బిల్లు నిదర్శనమని జితేంద్రసింగ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇవి క్రమంగా వ్యవస్థాగత నేరాలుగా మారాయని, వీటిని అరికట్టేందుకే చట్టంలో మార్పులు చేస్తున్నామని సభకు వివరించారు. 2009, 2011లో ఎన్నో పేపర్‌లు లీకయ్యాయి. 2012లో ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ అయ్యింది. యూపీ, తమిళనాడుల్లోనూ ఈ ఘటనలు చోటుచేసు కున్నాయి. ఎన్నో ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లోనూ ప్రయత్నాలు జరిగాయి. అయితే, అవి ఎందుకు పూర్తి కాలేదో నాటి పాలకులే సమాధానం చెప్పాలి. క్రమంగా ఇవి వ్యవస్థాగత నేరాలుగా మారాయి. ఇటీవల నీట్ పేపర్ లీక్ విషయం తెలియగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటువంటి నేరాలను అరికట్టేందుకు ప్రస్తుతం తీసుకొచ్చిన బిల్లు ఎంతో ఉపయోగకరం. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించాం. దోషులకు శిక్షలను పదేళ్లకు పెంచాం. లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచాం. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశాం అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# నిరసనకారులపై చర్యలు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా, అత్యున్నత న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 'నిర్దోషులపై అతిక్రమణలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ఊరుకోదు, తన పని తాను చేసుకుపోతుంది' అని ధర్మాసనం హెచ్చరించింది. ఈ ఘటనలపై 'స్వతంత్ర విచారణ' జరగాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. 'బాధ్యులను తేల్చనప్పుడు, విచారణకు అర్థమే లేదు' అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలుపడం పౌరుల ప్రాథమిక హక్కు అని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. నీట్ పరీక్షలో అక్రమాలపై న్యాయం కోరుతూ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న తరుణంలో, వారిపై బలాన్ని ప్రయోగించడం సరికాదని కోర్టు భావించింది. ఈ ఆందోళనల సమయంలో విద్యార్థులపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, గాయపడిన పోలీసుల రక్షణ, వారి భద్రతా పరికరాల గురించి కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కోర్టు పేర్కొంది. శాంతిభద్రతల నిర్వహణ అనేది ద్వితీయ ప్రాధాన్యం కాకూడదని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా వివిధ సందర్భాల్లో జరుగుతున్న నిరసనల సమయంలో శాంతిభద్రతల నిర్వహణకు, అల్లర్లను అదుపు చేయడానికి సంబంధించి ఒకే విధమైన ప్రొటోకాల్ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు వేర్వేరుగా ప్రవర్తించడం సరికాదని, నిర్దిష్ట నియమావళి ఉండాలని సూచించింది.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 28:**రాబోయే రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని కేంద్ర వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ ప్రత్యామ్నాయ ప్రణాళిక, వనమహోత్సవం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్.పీ లతో మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఐదు, ఆరు జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు కాగా 26 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందన్నారు. వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యామ్నాయ ప్రణాళికలో భాగంగా జిల్లాల్లో విత్తన మేళాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల విషయంలో ఏవిధమైన సహాయం కావాలన్నా అందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని సిఎస్ తెలిపారు. కాగా, రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో విస్తృత స్థాయిలో కురుస్తాయన్న భారత వాతావరణ శాఖ తాజా సూచనల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు.ప్రధానంగా, వివిధ శాఖలతో సమన్వయంతో పని చేయాలన్నారు. భద్రాచలం, ములుగు, నిర్మల్ జిల్లాలలో ఎన్‌డిఆర్ఎఫ్ ఈ బృందాలను అందుబాటులో ఉంచామన్నారు. హైదరాబాద్, ఇతర ప్రధాన కేంద్రాల్లో ఉన్న ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను కూడా అవసరం ఉన్న చోటుకు తరలిస్తామన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్,కార్యదర్శులు దాసరి హరిచందన, సురేంద్ర మోహన్ పాల్గొన్నారు.

# రైతుకు సాంకేతికత చేరవేయడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం రైతునేస్తం 100వ ఎపిసోడ్‌ను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రైతు - శాస్త్రవేత్త - అధికారుల అనుసంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదిక రైతునేస్తమని అన్నారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం.. నేడు 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఇప్పటివరకు 27.30 లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరినట్లు వెల్లడించారు.

ప్రతి మంగళవారం రైతుల ప్రశ్నలకు ప్రత్యక్షంగా శాస్త్రవేత్తలు సమాధానాలు ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఎల్-నినో సవాళ్లను ఎదుర్కోవడంలో రైతునేస్తం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయిల్ పామ్, ఉద్యాన, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి సారించాలన్నారు. జులైలో 27 శాతం వర్షపాతం లోటు నమోదైందని వెల్లడించారు. ఆగస్టు 10 ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలాల సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లాలకు చెందిన ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు.

# భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం

(మొదటి పేజీ తరువాయి)

గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో మిక్షించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ-సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీ-సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి గారు ఆదేశించారు.

భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీ-సర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ-సర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికత తో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడ తాయని తెలిపారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి తెలిపారు.

దీనివల్ల భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశిరచిన లక్ష్యాల మేరకు రీ-సర్వేను విజయవంతంగా పూర్తి చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని అదేవిధంగా ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చెందేలా సర్వే చేపట్టాలని ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.

# ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా సాగాలి

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా. నాగం వర్షిత్ రెడ్డి**




తొలి అక్షరం/చౌటుప్పల్ జులై 28: భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన SIR ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని 19వ వార్డు, 39వ బూత్ స్థానిక బీఎల్ఓ బుచ్చి రాములును నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు డా. నాగం వర్షిత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓను ఉద్దేశించి ఓటరు నమోదు ప్రక్రియ ఎలా కొనసాగుతోందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన, నిజమైన ఓటర్లను మాత్రమే నమోదు చేసి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. స్థానికంగా నివసించని వారు, అనర్హ ఓటర్ల వివరాలను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటూ, అప్పగించిన బాధ్యతను నిజాయితీగా, నిబద్ధతతో నిర్వర్తించాలని బీఎల్ఓకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్, జిల్లా కమిటీ మాజీ ఉపాధ్యక్షులు రమణ గోని శంకరయ్య, ఫ్లోర్ లీడర్ బుద్ద సురేష్, సీనియర్ నాయకులు గుజ్జుల సురేందర్ రెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జ్ అనపర్తి యాదగిరి, ఆలే చిరంజీవి, పోలపల్లి ముత్తయ్య, కడవేరు పాండు, ధర్మోజిగూడెం ఉపసర్పంచ్ ఫకీర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ ఉపాధ్యక్షులు గుండెబోయిన వేణు, BLA-2లు మారగోని గణేష్, అన్నమోని రాజేష్, బూత్ అధ్యక్షులు పాశం భరత్, దండం సత్తిరెడ్డి, ఇటికాల దామోదర్ రెడ్డి, గుండపల్లి వెంకటరెడ్డితో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి... ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకోవాలి

**• సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి**




తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 28: చౌటుప్పల్‌లోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాగీరు కిష్టయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పన్నెండు సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీమోడీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామని, ఎస్సీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రకటించినప్పటికీ, ఆ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అలాగే, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొంటూ, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ పారదర్శకంగా, చట్టబద్ధంగా జరగాలని అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితాల్లో మార్పులు చేయడంపై ప్రజల్లో వ్యక్తమవుతున్న ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని, ప్రతి అర్హుడైన ఓటరికి తన ఓటు హక్కు రక్షించబడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని చౌటుప్పల్ మండల వ్యాప్తంగా ఉన్న స్థానిక పరిశ్రమలలో స్థానిక నిరుద్యోగులకు యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి లేనియెడల నిరుద్యోగులని సమీకరించి విస్తృతమైన ప్రజా పోరాటం నిర్వహిస్తామని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు మండల కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి చింతల సుదర్శన్ మండల కమిటీ సభ్యులు అంతటి అశోక్ పొట్ట శ్రీనివాస్ పల్లె మధు కృష్ణ జక్కిడి దేవేందర్ రెడ్డి కొంతం సుశీల చెరుకు లక్ష్మమ్మ కొండే శ్రీశైలం ఎలమల్ల సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

# ఉపసర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన డా. సుర్కంటి శ్రీధర్ రెడ్డి.**

**జిల్లా అధ్యక్షులు ఉపసర్పంచ్‌ల ఫోరం యాదాద్రి భువనగిరి**






తొలి అక్షరం/చౌటుప్పల్ జులై 28: తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు డా. సుర్కంటి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు జిల్లా ఉపసర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో, డా. సుర్కంటి శ్రీధర్ రెడ్డి ఫోన్ ద్వారా జిల్లా కలెక్టర్‌ను సంప్రదించారు. వినతిపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి జయకి అందజేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపసర్పంచ్‌లు కలిసి జిల్లా రెవెన్యూ అధికారి జయ గారికి వినతిపత్రాన్ని సమర్పించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా రెవెన్యూ అధికారి సానుకూలంగా స్పందిస్తూ, ఉపసర్పంచ్‌ల సమస్యలు మరియు డిమాండ్లను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో జరిగిన సంభాషణలో, ఉపసర్పంచ్‌ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 17 మండలాల జిల్లా కమిటీ సభ్యులు, మండల ఫోరం అధ్యక్షులు, వివిధ గ్రామాల ఉపసర్పంచ్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ జిల్లా అధ్యక్షులు డా. సుర్కంటి శ్రీధర్ రెడ్డి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పెద్దవంగరలో అభివృద్ధి పనులకు శ్రీకారం.. పలు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శంకుస్థాపన











తొలి అక్షరం /పెద్దవంగర జులై 28: మండల కేంద్రంలో గ్రామాభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్మాణ పనులకు పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి శంకుస్థాపన చేశారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, మహిళల సాధికారత, విద్యా సంస్థల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ చేపట్టిన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.27 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, రూ.10 లక్షల వ్యయంతో మహిళా సమైక్య భవన నిర్మాణానికి, అలాగే పెద్దవంగర ఎంపీపీఎస్ ఎం పి పి ఎస్ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఎల్బీ తండా. చిన్న వంగర. బావోజితండా. చిట్యాల. బొమ్మకల్. ఉప్పరిగూడెం. కోరి పెల్లి. టిక్యా తండా. రామోజీ తండా. గంట్లకుంట్ల. జయరాం తండా. పడమటి తండా. అవుతాపురంగ్రామాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం అంగన్వాడి భవన నిర్మాణం సిసి రోడ్డు మరియు చిన్న పిల్లలకు స్కూలు యూనిఫామ్ లు అందజేస్తూ ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళా సంఘాలకు అవసరమైన సౌకర్యాలు, గ్రామాల్లో మెరుగైన రహదారులు, విద్యార్థులకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రంగు మురళి. ప్రధాన కార్యదర్శి పొడిశెట్టి సైదులు. మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముద్దసాని సురేష్. రవీందర్ రెడ్డి. స్థానిక సర్పంచ్ ముద్దసాని పారిజాతం సురేష్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు బీస్ హరికృష్ణ. సీనియర్ నాయకులు జాటోత్ నీహు నాయక్. బానోత్ వెంకన్న. నగేష్. తన్నీరు వేణు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్ నాయక్. స్థానిక సర్పంచ్ లు తోటకూరి శ్రీనివాస్. సోమి రమేష్. విజయ. సోమన్న. యాకాలక్ష్మి. సోమన్న. దివ్యభారతి. దుంపల శ్రీదేవి. శ్యామ్. పొడిశెట్టి యాకయ్య. ఈదురు బుచ్చమ్మ. పుల్లమ్మ. పరమేష్. ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, సంబంధిత శాఖ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువత గ్రామస్థులు పాల్గొన్నారు.

# యశోద హాస్పిటల్‌లో పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన నెక్కొండ మండల మాజీ మార్కెట్ చైర్మన్ గుంటుక సోమయ్య

**- చిన్నకోర్పోల్ గ్రామ టిఆర్ఎస్ మాజీ సర్పంచ్ కర్ర వెంక రెడ్డి.**





తొలిఅక్షరం/నెక్కొండ జూలై 28: వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ బి ఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ద స్వప్న సుదర్శన్ ఇటీవల గుండెపోటుకు గురై యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తరుణంలో నెక్కొండ మండలం మాజీ మార్కెట్ చైర్మన్ గుంటుక సోమయ్య, చిన్న కొర్పోల్ గ్రామా బి ఆర్ఎస్ మాజీ సర్పంచ్ కర్ర వెంకట్ రెడ్డి నూతనంగా ఎన్నుకోబడిన ఉప సర్పంచ్ తొగరు వెంకన్న ,దోమల అనిల్, చిన్న కొర్పోల్ మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షులు చిరబోయిన ఏకాంబరం, కర్ర మైపాల్ రెడ్డి, గంగపురి శ్రీకాంత్, మంద ప్రకాష్,మంద ప్రశాంత్,లు సికింద్రాబాద్ లోని యశోద హాస్పిటల్లో ఉన్న ఉద్యమ నేత బి,ఆర్,ఎస్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితుల గురించి మర్యాదపూర్వకంగా పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి ని కలిసి తెలుసుకోవడం జరిగింది. అలాగే పెద్ది ఆరోగ్యవంతంగా కోలుకోని ఇంటికి రావాలని కోరుకోవడం జరిగింది.

# షాద్‌నగర్‌లో బూర్గుల రామకృష్ణారావు విగ్రహావిష్కరణ.. ఎమ్మెల్యే శంకర్‌కు బ్రాహ్మణ సమాఖ్య ఘన సన్మానం

**బూర్గుల సేవలకు చిరస్మరణీయ గుర్తింపు.. షాద్‌నగర్‌లో విగ్రహావిష్కరణ**






తొలి అక్షరం/షాద్ నగర్, జులై 28: తెలంగాణ తొలి ప్రజాస్వామ్య ఎన్నికైన ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు విగ్రహాన్ని షాద్‌నగర్ పట్టణంలో ప్రతిష్ఠించడం పట్ల బ్రాహ్మణ సమాఖ్య హర్షం వ్యక్తం చేసింది. విగ్రహాన్ని ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, తెలంగాణ రాజకీయ చరిత్రలో బూర్గుల రామకృష్ణారావు సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజా సంక్షేమం, పరిపాలనా సంస్కరణలు, విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. మహనీయుల సేవలను ప్రజలకు, ముఖ్యంగా యువతకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే బ్రాహ్మణ సమాజం కోరిన మరో ముఖ్యమైన అభ్యర్థనను కూడా త్వరలో నెరవేర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బ్రాహ్మణ సమాఖ్య నాయకులు మాట్లాడుతూ, బూర్గుల రామకృష్ణారావు వంటి మహనీయుడి సేవలను స్మరించుకునేలా షాద్‌నగర్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా భావితరాలకు ఆయన గొప్పతనం తెలియజేసే అవకాశం కలిగిందని పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం బూర్గుల రామకృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎమ్మార్వో రామారావు, నియోజకవర్గ బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, టౌన్ అధ్యక్షుడు వావిలాల సుజీవన్, జిల్లా కార్యదర్శి రవి శర్మ, రాజగోపాల్, నెమలి శ్రీకాంత్‌రావు, వేణుగోపాల్, మణి, సందీప్, సునీల్, ఫణి శర్మ, పూర్ణచంద్రరావు, సుదర్శన్ రావు, సుబ్రహ్మణ్యం, సంజయ్, భరత్‌కుమార్‌తో పాటు బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి...

**- వలిగొండ డిప్యూటీ తహసిల్దార్‌కు సిపిఎం వినతి పత్రం..**




**తొలి అక్షరం/వలిగొండ, జులై 28:** వలిగొండ మండల పరిధిలోని నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మరియు పల్లె దవఖానాలలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని సిపిఎం వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ పల్లవి గారికి వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు మాట్లాడుతూ వలిగొండ మండల వ్యాప్తంగా నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వలిగొండ,వేములకొండ,వర్కట్ పల్లి ,వేలువర్తి లతోపాటు రెడ్లరేపాక, పులిగిల్ల,అరూర్, గ్రామాల్లో పల్లె దవాఖానాలు ఉన్నాయని వీటిలో అనేక సమస్యలతో వైద్యం కోసం వెళ్తున్న ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వీటిల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు వలిగొండ మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో 30 పడకల ఆసుపత్రిగా 24 గంటల వైద్య సేవలను అందించాలన్నారు, వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరి గోడ పూర్తిగా ధ్వంసమై కొన్నిచోట్ల కూలిపోయిందని దీంతో ఆసుపత్రి సిబ్బందితోపాటు ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నూతన ప్రహరీ గోడను నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు, వెల్వర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి డిప్యూటేషన్ పై డాక్టర్ను నియమిస్తూ వారికి కనీసం గెజిటెడ్ హోదా కూడా లేకుండా 12 సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేస్తున్నారని వెంటనే రెగ్యులర్ డాక్టర్ను నియమించి వెల్వర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గెజిటెడ్ హోదాను కల్పించాలని డిమాండ్ చేశారు అదేవిధంగా వర్కట్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిత్యం వందల మందికి వైద్య సౌకర్యాలను అందిస్తుందని కానీ అక్కడ ఒక్క మెడికల్ ఆఫీసర్ మాత్రమే ఉండటం జరుగుతుందని రెండవ మెడికల్ ఆఫీసర్ ను వెంటనే నియమించాలన్నారు, పులిగిల్ల,రెడ్ల రేపాక గ్రామాల్లో ఉన్న పల్లె దవఖానాలకు కనీస సౌకర్యాలు లేవని నూతన భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు పల్లె దవఖానాలలో అనేక ఖాళీ పోస్టులు ఉన్నాయని వెంటనే వాటన్నిటినీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు మొగిలిపాక గోపాల్,గాజుల ఆంజనేయులు, వలిగొండ పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు కొండూరు సత్తయ్య, ఉండ్రాటి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

# దండు మల్కాపురం శ్రీ ఆందోల్ మైసమ్మ తొలి బోన జాతరకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఆహ్వానం



**తొలి అక్షరం/చౌటుప్పల్ జులై 28:** మంగళవారం దండు మల్కాపురం గ్రామంలోని శ్రీ ఆందోల్ మైసమ్మ దేవాలయంలో నిర్వహించనున్న స్థానిక కుమ్మర్ల తొలి బోన జాతర ఉత్సవాల సందర్భంగా, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారిని హైదరాబాద్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. తొలి బోన ఉత్సవ కమిటీ చైర్మన్ మల్కాజిగిరి అంజయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానించగా, ఆయన ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించి తొలి బోన జాతర కార్యక్రమానికి హాజరయ్యేందుకు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో చిన్నకొండూర్ గ్రామ సర్పంచ్ తీగుళ్ల చంద్రయ్య, కుమ్మరి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాడూరు వెంకటేశం, చౌటుప్పల్ మండల కుమ్మరి సంఘం అధ్యక్షులు సిలివేరు శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు సిలివేరు వెంకటేష్, సిలివేరు బాలయ్య, గ్రామ కుమ్మరి సంఘం అధ్యక్షులు మల్కాజిగిరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# నెక్కొండ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆటో సౌకర్యం కల్పించిన దాత

**- సాఫ్ట్ వేర్ ఇంజనీర్ జుత్తి కిరణ్ ప్రసాద్**



**తొలి అక్షరం/నెక్కొండ జూలై 28:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని గుండ్రపల్లి గ్రామానికి చెందిన పది మంది విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నెక్కొండలో 6వ, తరగతి నుండి 10వ,తరగతి వరకు చదువుతున్నారు. వీరు ప్రతిరోజూ సుమారు రెండు కిలోమీటర్లు కాలినడకన పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. మార్గమధ్యంలో కోతుల బెడద కూడా ఉండటంతో తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపడంలో ఇబ్బందులు ఎదుర్కొంటూ, చదువు మాన్పించే పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను తెలుసుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నెక్కొండలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వంగర లక్ష్మణ్ తన బాల్యమిత్రుడు, హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జుత్తి కిరణ్ ప్రసాద్ కి వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు స్వయంగా నిర్వహించుకునే ఆటో సౌకర్యానికి నెలకు 6,500 చొప్పున 10 నెలలకు మొత్తం 65,000 ఆర్థిక సహాయం అందించేందుకు జుత్తి కిరణ్ ప్రసాద్ ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా గుండ్రపల్లి విద్యార్థుల తల్లిదండ్రులు, షేక్ మదార్, షేక్ యాకుబ్, షేక్ అప్సనా, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు బండారి రమేష్ గారు, ఉపాధ్యాయ బృందం కలిసి జుత్తి కిరణ్ ప్రసాద్ గారి దాతృత్వాన్ని, అలాగే ఉపాధ్యాయుడు వంగర లక్ష్మణ్ చొరవను అభినందించారు.

# మండల సర్పంచుల ఆధ్వర్యంలో జన్మదిన శుభాకాంక్షలు అందుకున్న బంజరపల్లి సర్పంచ్

**- నెక్కొండ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు భూక్య రమేష్ రాథోడ్.**





**తొలి అక్షరం/నెక్కొండ జులై 28:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బంజరపల్లి సర్పంచ్ భుక్య రమేష్ రాథోడ్. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి వీరాభిమాని, బంజరపల్లి గ్రామ ప్రథమ పౌరుడు, ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా నిలిచే ఆపద్బాంధవుడు, ప్రియ మిత్రుడు, యువ నాయకుడు, సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. భగవంతుని ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవిస్తూ ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, మీ మిత్రులు నెక్కొండ మండల వివిధ గ్రామాల సర్పంచులు కోరుకోవడం జరిగింది. వీరి నాయకత్వంలో బంజరపల్లి గ్రామం మరింత అభివృద్ధి సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా గంగుల రాజన్న జన్మదినం వేడుకలు








రామన్నపేట మండల కేంద్రంలో ఘనంగా గంగుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు నకిరేకల్ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రామన్నపేట ముద్దుబిడ్డయువ నాయకులు రాన్నపేట ఆశా కిరణం పల్లివాడ గ్రామ మాజీ సర్పంచ్ గంగుల వెంకట రాజిరెడ్డి జన్మదిన వేడుకలు రామన్నపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ సెంటర్ వద్ద పెద్ద ఎత్తున వివిధ గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో పార్టీ వివిధ హోదాలో ఉన్న నాయకుల సమక్షంలో కార్యకర్తల సమక్షంలో ఘనంగా జరిగినవి. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ నందు పండ్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగినది.

# గురు పౌర్ణమి

**కనుచూపు మేరలో చీకటి కమ్ముకుంటే**
**దారి చూపడానికి దీపంలా వెలిగేవాడే గురువు!**
**అజ్ఞానపు పొరలను ఒలిచి,**
**అక్షరపు వెలుగును మన గుండెల్లో నింపేవాడే గురువు!**
**ఆషాఢ మాసపు జాబిలి వెన్నెలలా**
**మనసంతా జ్ఞానపు అమృతం చల్లే రోజూ ఇది!**
**వేదాలను మనకు పంచిన వేద వ్యాసుని తలుచుకుంటూ**
**నడక నేర్పిన ఆ గురు పాదాలకు నమస్కరించే పండుగ ఇది!**
**అమ్మ రూపంలో లాలన, నాన్న రూపంలో పాలన నేర్పిన తర్వాత**
**జీవితమనే పాఠశాలలో గమ్యం చేర్చే దిక్సూచి గురువే!**
**తప్పు చేస్తే మందలించి, తప్పు ఒప్పుకుంటే వెన్నుతట్టే**
**ఆ చల్లని చేతుల స్పర్శే మన జీవితానికి శ్రీరామరక్ష!**
**అక్షరం ముక్కతో అడుగు వేయించి**
**ప్రపంచాన్ని గెలిచే ధైర్యం నూరిపోసే మనిషి రూపం గురువు!**
**తరాలు మారుతున్నా, తలపులు మారుతున్నా**
**గురువుకు శిష్యుడికి మధ్య ఉండే అనుబంధం ఎప్పటికీ కరిగిపోదు!**
**ఈ పౌర్ణమి వెన్నెలలో...**
**మన గుండెల్లో జ్ఞానపు దీపాలు వెలిగిస్తూ**
**సృష్టికి మూలమైన గురువను తలుచుకుంటూ**
**తలవంచి నమస్కరిద్దాం**

**- రచనతాడూరి సంపత్ (సీనియర్ జర్నలిస్ట్)**



# మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు నేస్తం కార్యక్రమం

**- వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్ ఐఏఎస్**




**తొలి అక్షరం/నెక్కొండ జులై 28:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ప్రతి వారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం 100 వ, ఎపిసోడ్ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సురేంద్ర మోహన్ ఐ ఏ ఎస్ , వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి ఐ ఏ ఎస్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న కార్యక్రమం ను రైతు వేదిక నెక్కొండ నుండి మండల రైతులు విక్షించటం జరిగినది, ఈ కార్యక్రమం లో పిఎసిఎస్ నెక్కొండ చైర్మన్ చల్లా శ్రీపాల్ రెడ్డి, పిఏసిఎస్ సూరిపల్లి చైర్మన్ మదాటి శ్రీనివాస్, నెక్కొండ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ , అప్పలరావుపేట గ్రామ సర్పంచ్ ఉడుగుల అశోక్ , అజ్మీరా మంగ్యా తండా సర్పంచ్ మాలోత్ వెంకట్ నాయక్, పాల్గొన్నారు, ఈ కార్యక్రమం ద్వారా రైతులను ఉద్దేశించి వ్యవసాయ శాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ ప్రస్తుత ఎల్ నినో ప్రభావం వలన తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అంచనా ఉన్నందున రైతులు తక్కువ నీటి తో, తక్కువ పంట కాలం మరియు రైతులకు ఆదాయం ఇచ్చు ఆముదం, మినుము లు, పొద్దుతిరుగుడు, జొన్నలు, బంతి పూలు, కూరగాయలు వంటివి సాగు చేసుకోవాలి అని తెలిపారు. అదే విధంగా రానున్న రోజుల్లో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం పెంచాలని రైతులకు ఈ పంట సాగు తో మంచి ఆదాయం వస్తుందని తెలిపారు , ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# యశోద హాస్పిటల్‌లో పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి , ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి





**తొలిఅక్షరం/నెక్కొండ జులై 28:** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఇటీవల గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ని కలిసి పరామర్శించిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి. అనంతరం పెద్ది స్వప్న వారి కుటుంబ సభ్యులకు కలిసి ధైర్యం చెప్పడం జరిగింది.

# శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థాన ఆవరణలో గ్రామ ప్రజలకు సమిష్టి ధర్మకర్తల ప్రమాణ స్వీకారోత్సవం

**ముఖ్య అతిథిగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న మాచర్ల సంతోష్ కుమార్**



**తొలి అక్షరం/చౌటుప్పల్ జులై 28:** కొయ్యలగూడెం గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో నూతన ధర్మకర్తల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం బుధవారం (29-07-2026) ఉదయం 9:30 గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆయన సమక్షంలో దేవస్థాన నూతన ధర్మకర్తల ప్రమాణ స్వీకారం జరగనుంది. అలాగే, దేవస్థాన చైర్మన్‌గా శ్రీ మాచర్ల సంతోష్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని గ్రామ ప్రజలకు నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# వరంగల్‌లో పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి

● చైర్ పర్సన్‌ను కలిసిన రైతు సంఘాల నాయకులు



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ లో నూతన పండ్ల మార్కెట్ నిర్మాణం చేపట్టాలని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ఎర్ర ప్రియాంక పులి అనిల్,డైరెక్టర్ పూర్ణచందర్ లకు వరంగల్ పండ్ల మార్కెట్ భూసాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా రైతు సంఘాల నాయకులు వినతిపత్రం ఇచ్చారు.వివిధ రాష్ట్రాల నుండి,తెలంగాణ రాష్ట్రం లోని వివిధ జిల్లాల నుండి వరంగల్ నగరానికి హోల్ సేల్ గా అమ్ముకోవడానికి రైతులు అన్ని రకాల పండ్లను తీసుకొస్తారని అయితే సరుకులను అమ్ముకోవడానికి మార్కెట్ లేనందున రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే వరంగల్ నగరానికి చుట్టూ ఉన్నటువంటి గ్రామ ప్రాంతాల్లో ఉన్న భూముల్లో 30 ఎకరాలను సేకరించి ప్రత్యేకమైన పండ్ల మార్కెట్ ఏర్పాటు చేయాలని చైర్పర్సన్ కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.చైర్ పర్సన్ ను కలిసిన వారిలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్,అఖిలభారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు,తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఏఐకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపల్లి బాబు,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చుక్క మొగిలి,అఖిలభారత కిసాన్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు సుధమల్ల భాస్కర్,ఏఐయుకేఎస్ అధ్యక్షులు మైదం పాణి,ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి,నాయకులు హంసల్ రెడ్డి,బండి వెంకటేశ్వర్లు,బోళ్ల ఎల్లయ్య,రమేష్ తదితరులు ఉన్నారు.

# డ్రగ్స్‌కు ‘నో‘ చెప్పండి.. జీవితానికి ‘యెస్‘ చెప్పండి

● రామన్నపేటలో పోలీసుల విస్తృత అవగాహన ● డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీలు: ఎస్ఐ గోపాతి సతీష్

**తొలి అక్షరం/రామన్నపేట జులై 28:** మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని రామన్నపేట ఎస్ఐ గోపాతి సతీష్ పిలుపునిచ్చారు.తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ( టి జి ఏ ఎన్ బి) ఆధ్వర్యంలో మంగళవారం రామన్నపేటలో మాదకద్రవ్యాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. “Say No to Drugs Say Yes to Life“ అనే నినాదాలతో బ్యానర్లు ప్రదర్శిస్తూ ప్రజలకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం కుటుంబాలను, సమాజాన్ని, యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, అలాంటి కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే 1908 టోల్‌ఫ్రీ నంబర్ లేదా 8712671111 వాట్సాప్ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు.అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ చౌరస్తా వద్ద ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరిస్తూ, వాహనదారులకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. అదే సమయంలో వాహనాల పత్రాలను పరిశీలిస్తూ ప్రత్యేక వెహికల్ చెకింగ్ చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్పష్టం చేశారు.డ్రగ్స్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి సామాజిక రుగ్మతలను అరికట్టడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ గోపాతి సతీష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సురేందర్, పిసి స్వామి నాయక్, రాఘవేంద్ర, ఎస్జి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.





# తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి సమక్షంలో గంగుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు



**తొలి అక్షరం/రామన్నపేట జులై 28:** కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రధాన అనుచరుడు రామన్నపేట మండల ప్రజల ఆశ కిరణం నమ్ముకున్న కార్యకర్తలకు చేదోడు వాదోడుగా ఉండే నాయకుడు పల్లివాడ గ్రామ మాజీ సర్పంచ్ గంగుల వెంకట రాజిరెడ్డి జన్మదిన వేడుకలు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి సమక్షంలో ఘనంగా జరిగినవి. తిరుమల తిరుపతి వెంకటేశ్వరుని ఆశీస్సులు రామన్నపేట మండల ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పున్న. జగన్మోహన్ మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి వెంకట్ రెడ్డి శంబాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బస్సు యాత్ర ప్రదర్శన సభను జయప్రదం చేయండి

భావడ్ల పెల్లి బాలరాజు ఎర్ర రవీందర్

కల్లు గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు

**తొలి అక్షరం/రామన్నపేట జులై 28:** తెలంగాణ రాష్ట్రంలో కల్లుగీత వృత్తి రక్షణ కోసం. హక్కుల కోసం పనిచేసి అమరులైన కల్లుగీత కార్మిక సంఘం నాయకులను స్మరిస్తూ వారి గ్రామాలలో సభలను నిర్వహిస్తూ వారి ఆశయాలను మరొక్కసారి మననం చేస్తూ ఇప్పుడు వృత్తి రక్షణ కోసం హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని ఆగస్టు 2 మానుకోట జిల్లా కేంద్రంలో ప్రారంభమై ఆగస్టు 18న హైదరాబాదులో పాపన్న జయంతిన ముగుస్తున్న ఇట్టి యాత్ర ఆగస్టు 9న రామన్నపేటపట్టణ కేంద్రం కు విచ్చేస్తున్న సందర్భంలో పెద్ద ఎత్తున ప్రదర్శన సుభాసు చౌరస్తా వద్ద సభ కార్యక్రమాన్ని. సభను. 9వ తారీకు భువనగిరి జిల్లా కేంద్రంలో జరుగు ర్యాలీని సభను కల్లుగీత కార్మిక సోదరులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా జనం పెల్లి ఇస్కిల్లా ఉత్త టూరు గ్రామాలగీత కార్మికులను కలిసి కోరారు. ఇట్టి సమావేశంలో అమరులు యాది లో బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. తదుపరి జరిగిన సమావేశంలో పాల్గొని వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మూడు లక్షల మంది గీత కార్మికులు వృత్తిలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారని చేతివృత్తులలో అత్యంత ప్రమాదకరమైన వృత్తి కల్లుగీత వృత్తిని ఈ వృత్తి రక్షణకు కార్మికుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు గడిచిన ఇప్పటివరకు నిధులు కేటాయించకపోవడం వృత్తిలో ప్రమాదానికి గురై ఎక్స్ గ్రేషియా మంజూరై గీత కార్మికులకు రావలసిన డబ్బులను విడుదల చేయకపోవడం గీత కార్మికులపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని అన్నారు. ఈ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా తన మేనిఫెస్టోలో కల్లుగీత కార్మికులకు అనేక రకమైన వాగ్దానాలు ఇచ్చిందని ఇప్పటివరకు వాటిని అమలు చేసిన పరిస్థితి లేదని అందుకే కల్లుగీత కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గతంలో సంఘం నాయకత్వన జరిగిన పోరాటాల వల్ల అనేక హక్కులను సాధించుకున్న చరిత్ర కల్లు గీత కార్మికులదని ఇప్పుడు కూడా తమ సమస్యల పరిష్కారం కోసం కల్లుగీత కార్మికులందరూ పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉన్నదని ప్రభుత్వాలను ఉద్యమాల ద్వారా ఒత్తిడి తెస్తానే తమ సమస్యల పరిష్కారం అవుతాయని అందుకు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత కార్మికులలో చైతన్యం తీసుకురావడానికి ఈ బస్సు యాత్ర ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడుకునూరు మల్లేశం మండల కోశాధికారి మునుకుంట్లలెనిన్ మండల కమిటీ సభ్యులు బైరు రమేష్ బైరు శంకరయ్య పబ్బుశేఖర్ గంగాధర్ పబ్బు వెంకన్న గడ్డమీది సత్తయ్య చెరుకు శ్రీనివాస్ మునుకుంట్ల స్వామి గడ్డమీది రమేష్ ఉయ్యాల సైదులు పొతాగోని స్వామి పబ్బు వెంకన్న కప్పల రాజయ్య కప్పల నవీన్ పబ్బు శంకరయ్య కాటమయ్య శ్రీను కృష్ణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు



# నివాళులర్పించిన రాష్ట్ర దివ్యాంగుల కమిటీ




**తొలి అక్షరం/రామన్నపేట జులై 28:** భారతదేశంలో అత్యున్నత స్థానంలో సేవలందించి ఉత్తమ పార్లమెంటేరియన్ గా గుర్తింపు పొంది కేంద్రంలో మంత్రి పదవులకు వన్నె తెచ్చి కోట్ల మంది హృదయాలలో నిలిచిన మహనీయుడు జైపాల్ రెడ్డిని భారతదేశ సమాజమంతా వారు చేసిన సేవను గుర్తుపెట్టుకున్నదని. అంగవైకల్యం శరీరానికే కానీ జ్ఞానానికి కాదని నిరూపించి మహనీయుడు నిస్వార్థ తో చరిత్రలో నిలిచిన మహనీయునిగా రాజకీయాల్లో గుర్తింపు తెచ్చారని డాక్టర్ ఎన్ అశోక్ గుర్తు చేసుకున్నారు ఏడవ వర్ధంతి సందర్భంగా శృతి వనంలో ఘాటులో రాష్ట్ర దివ్యాంగుల సంఘాలు నివాళులు అర్పించాయి డాక్టర్ అశోక్ మాట్లాడుతూ జైపాల్ రెడ్డి బాటలో దివ్యాంగులందరూ రాజకీయాలలో చైతన్యమై వారి బాటలో నడిచి హక్కులను ఆత్మ గౌరవాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో దివ్యాంగుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్. మహిళ సాధికారిక రాష్ట్ర అధ్యక్షురాలు కోళ్ల రాజ్యలక్ష్మి. విశ్వవిద్యాలయాల దివ్యాంగుల పురం రాష్ట్ర అధ్యక్షురాలు ధోరపల్లి దానమ్మ. విశ్వవిద్యాలయాల ఫోరం సహాయ కార్యదర్శి మోదల సైదులు యాదవ్. మహిళా సాధికారిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి .పి స్వప్న తదితరులు పాల్గొన్నారు

# ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించాలి.. నీటి సంరక్షణకు అందరూ బాధ్యత వహించాలి

- గిరాయిగుట్ట తండా గ్రామసభలో సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ పిలుపు

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 28:** ఫరూక్‌నగర్ మండలం గిరాయిగుట్ట తండా గ్రామపంచాయతీలో మంగళవారం సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన “తెలంగాణ జలసిరి“ కార్యక్రమంలో భాగంగా “వర్షపు బొట్టుఒడిసి పట్టు“ అంశంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ మాట్లాడుతూ, భవిష్యత్తులో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలని సూచించారు. తక్కువ నీటి అవసరం ఉండే పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందేలా రైతులు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు.గ్రామంలోని ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, అందుకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా పరిహారం అందిస్తోందని చెప్పారు. అలాగే కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం, బోరు బావుల సమీపంలో వర్షపు నీటిని భూగర్భంలోకి చేరేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు కలిసి ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఉపసర్పంచ్ రాజు, గ్రామ కార్యదర్శి వంశీకృష్ణ, పూజారి పెంటూ, వార్డు సభ్యులు సరిత, నరేష్‌బాబు, కుమార్, సరిత కిషన్, సీనియర్ నాయకుడు శ్రీను, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మమ్మ, కవిత, గ్రామపంచాయతీ సిబ్బంది గోపాల్, ముత్యాలి, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.



# బిఎల్ఏ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దైద రవీందర్



**తొలి అక్షరం/రామన్నపేట జులై 28:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం కేంద్రంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి టిపిసిసి అధ్యక్షుడు బొమ్మగాని మహేష్ గౌడ్ , రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షీ నటరాజన్ ఆదేశాల ప్రకారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బి ఎల్ ఏ సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని బి ఎల్ ఏ లను ఉద్దేశించి మాట్లాడిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సత్తుపల్లి నియోజకవర్గ ఎస్ ఐ ఆర్ కో - ఆర్డినేటర్ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# సహజ వ్యవసాయ క్షేత్రంలో ఢిల్లీ వరల్డ్ స్కూల్ విద్యార్థుల అధ్యయన యాత్ర

రైతు శ్రమను ప్రత్యక్షంగా తెలుసుకున్న ఢిల్లీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు

సహజ సాగు విధానాలపై విద్యార్థులకు క్షేత్రస్థాయి అవగాహన

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 28:** విద్యార్థుల్లో ప్రకృతి వ్యవసాయం, రైతుల శ్రమ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఢిల్లీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు మంగళవారం కేశంపేటలోని సహజ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, స్థానిక రైతులు విద్యార్థులకు వ్యవసాయం ప్రాముఖ్యతతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు.పర్యటనలో భాగంగా విద్యార్థులు గానుగ ద్వారా సాంప్రదాయ నూనె తయారీ, వర్షపు నీటి సంరక్షణ పద్ధతులు, గోబర్ గ్యాస్ ప్లాంట్ పనితీరు, దేశీ ఆవుల పెంపకం, ఫుడ్ ఫారెస్ట్, ఫైవ్-లేయర్ సాగు విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. సహజ వ్యవసాయం ద్వారా భూమి సారాన్ని కాపాడడంతో పాటు పర్యావరణ సమతుల్యతను పరిరక్షించవచ్చని తెలుసుకున్నారు.వాతావరణ మార్పులు, కరువు పరిస్థితులు, పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించడంలో సహజ వ్యవసాయ పద్ధతులు ఉపయోగకరమని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈ క్షేత్ర సందర్శన తమకు వ్యవసాయంపై కొత్త అవగాహన కల్పించడంతో పాటు సమాజంలో రైతు పాత్ర ఎంత గొప్పదో తెలియజేసిందని వారు పేర్కొన్నారు.



# నాయిని తన అభివృద్ధి మీద నమ్మకం ఉంటే, దమ్ము ఉంటే రాజీనామా చేసి మళ్ళీ గెలవాలి





**తోఫా ఇచ్చిన తోపు కేసీఆర్,**

**దోకా ఇచ్చిన దగుల్బాజీ రేవంత్ రెడ్డి**

**రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మైనార్టీలకు కుసుల్‌ఖానా కట్టించిన ఘనత వినయన్నదే**

**బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు**

**నయీమొద్దీన్,మసూద్**

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మైనార్టీలకు కుసుల్‌ఖానా కట్టించిన ఘనత ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ కే దక్కుతుందని,షాదీఖానా కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం స్థలం కేటాయిస్తే,కాంగ్రెస్ లాక్కొందని,మైనార్టీల పోరాటం,బీఆర్ఎస్ శ్రేణుల ఉద్యమం,కేటీఆర్, దాస్యం వినయ్ భాస్కర్ కృషితో మైనార్టీలకు కేటాయించిన స్థలాన్ని తిరిగి సాధించుకున్నామని,కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ము ఉంటే వెంటనే రూ.5 కోట్ల నిధులతో షాదీఖానా నిర్మించాలి అని బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు నయీమొద్దీన్, మసూద్ లు అన్నారు.గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ బాలసముద్రం నందు బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ విభాగం నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించి,మీడియాతో మాట్లాడారు.ఉమ్మడి వరంగల్ జిల్లా మైనార్టీ విభాగం మాజీ అధ్యక్షులు ఎండీ నయీమొద్దీన్ మాట్లాడుతూ...ముస్లిం షాదీఖానా కోసం దాస్యం వినయ్ భాస్కర్ 2022 లో కాజీపేట మండలం న్యూశాయంపేట 579 సర్వే నంబర్‌లో 25 గుంటల స్థలాన్ని కేటాయించారని,నాటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ 5 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందన్నారు.2023లో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రంలో అధికారం వచ్చిందని,మూడు ఏండ్లలో షాదీఖానా పనుల్లో పురోగతి లేదని,షాదీఖానా కు కేటాయించిన స్థలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం,ఇక్కడి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాలతో స్థలాన్ని తిరిగి తీసుకున్నారని,మైనార్టీలు,బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు,మైనార్టీ విభాగం ఉద్యమంతో నేడు తిరిగి స్థలాన్ని పోరాడి సాధించుకున్నామన్నారు. కాంగ్రెస్ లో మాట్లాడుతున్న కొంత మందికి షాదీఖానా స్థలం ఎక్కడ ఉందో కనీసం అవగాహన ఉందా అని ప్రశ్నించారు.అసలు మైనార్టీలకు ఈ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని,స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేసింది ఏమీ లేదన్నారు.షాదీఖానా స్థలం కేటాయించింది దాస్యం వినయ్ భాస్కర్,నిధులు కేటాయించింది కేటీఆర్,కేసీఆర్ అని స్పష్టం చేశారు.కాంగ్రెస్ నాయకులకు నేను చాలెంజ్ చేస్తున్నా...ఒక నెల రోజుల్లో ఈ ప్రభుత్వం 5 కోట్ల నిధులు షాదీఖానాకు తెచ్చే దమ్ము ఉందా...నిధులు తెచ్చి నిర్మాణ పనులు మొదలుపెడుతారా... అని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ మాటల ప్రభుత్వం తప్ప చేతలు శూన్యం అన్నారు.420 హామీలు,6 గ్యారంటీలు అంటూ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారు తప్ప చేతలు ఏమీ లేవన్నారు.మైనార్టీ నాయకులు మసూద్ మాట్లాడుతూ...కేసీఆర్ సర్కారు మైనార్టీలకు తోఫా ఇచ్చిన తోపు సర్కారు,మైనార్టీ లకు దోకా ఇచ్చిన సర్కారు కాంగ్రెస్ సర్కారు అన్నారు.కేసీఆర్ సర్కారు మైనార్టీ లకు రాజకీయ పదవులు,100 శాతం సబ్సిడీ రుణాలు,వేల కోట్ల బడ్జెట్ కేటాయించడం జరిగిందని,వినయ్ భాస్కర్ మైనార్టీ కోసం కుసుల్ ఖానా,మహిళల కోసం కుట్టు మిషన్ లు,మైనార్టీలకు రుణాలు,వరంగల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్ పదవులు,గ్రంథాలయ చైర్మన్ పదవులు అనేకం మైనార్టీలకు ఇవ్వడం జరిగిందన్నారు.బొక్కలగడ్డ లో మైనార్టీల కోసం వినయ్ భాస్కర్ కుట్టు మిషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం,ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి 33 నెలల కాలంలో మట్టెవాడ ఈద్గా పనులు పూర్తి చేయలేక పోయాడు.ములుగు రోడ్‌లో నిర్మాణంలో ఉన్న కుసుల్ ఖానా నిర్మాణాన్ని పూర్తి చేయలేదు.ఉట్టికి ఎగరలేని అమ్మ ఆకాశానికి ఎగిరిందన్నట్టు,ఉన్న పనులు పూర్తి చేయలేనోళ్లు ఏమో సాధించామని ఫోజులు కొడుతున్నారు అని అన్నారు.భారాసా అంటే ప్రజలకు భరోసా షాదీఖానా విషయంలో మాజీ మంత్రి కేటీఆర్ ను వినయన్న నాయకత్వంలో కలిస్తే ఇక్కడి ఎమ్మెల్యే ఉల్లిక్కిపడ్డారు.మా పోరాటం ఉధృతం చేశాం.స్థలాన్ని తిరిగి దక్కించుకున్నాం.ఈ ప్రభుత్వానికి,నాయిని రాజేందర్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే షాదీఖానా స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి,నిర్మాణ పనులు మొదలుపెట్టాలన్నారు.ఇమామ్,మౌజమ్ లకు జీతాలు ఇవ్వలేని చేతకాని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం 33 నెలల కాలంలో రేవంత్ రెడ్డి మైనార్టీలకు చేసింది ఏమి లేదు ఎన్నికల సమయంలో మైనార్టీలకు పదవి ఇచ్చింది అది కూడా కాంగ్రెస్ కు ముస్లింల ఓట్ల కోసమే అన్నారు.కేసీఆర్ వరంగల్ కార్పొరేషన్,హైదరాబాద్ కార్పొరేషన్ లలో మైనార్టీ లకు డిప్యూటీ మేయర్ పదవులు ఇచ్చారు అని గుర్తు చేశారు.నాయిని రాజేందర్ రెడ్డికి తన అభివృద్ధి మీద నమ్మకం ఉంటే,ఆయనకు దమ్ము ఉంటే రాజీనామా చేసి మళ్ళీ గెలవాలన్నారు.మా మైనార్టీల సత్తా ఏంటో చూపిస్తాం.ఇంకోసారి మైనార్టీల స్థలం జోలికి రావొద్దు,వరంగల్ లో హజ్ హౌజ్ కట్టాలన్నారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి మైనార్టీల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదు,మంత్రి సురేఖ, నాయిని కి మధ్య ఎం ఉన్నా మైనార్టీల కోసం పని చేయాలన్నారు. షాదీఖానా,హజ్‌హౌజ్ కట్టి తీరాలని మైనార్టీల తరపున బీఆర్ఎస్ పార్టీగా డిమాండ్ చేస్తున్నాం అన్నారు.షాదీఖానా స్థలాన్ని తిరిగి కేటాయించడం పట్ల మైనార్టీలు సంతోషం వ్యక్తం చేస్తూ.. మిఠాయిలు తినిపించుకుని,టపాసులు కాల్చారు.సమావేశంలో మైనార్టీ కమిషన్ మాజీ మెంబర్ దర్శన్ సింగ్,గ్రేటర్ వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ సిరాజుద్దీన్,మైనార్టీ నాయకులు ఎండీ ఖలీల్,ఎస్కే మహమూద్,ఎండీ ఇస్మాయిల్,అబ్బు ఫెరోజ్,తౌసిఫ్,రషద్,తస్లీమ్,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జలసిరి బోర్వెల్ రీఛార్జ్ పని ప్రారంభం



**తొలి అక్షరం/రామన్నపేట జులై 28:**రామన్నపేట మండలం, జనంపల్లి గ్రామ పంచాయతీ లో వి బి జి రామ్ జి పథకం, తెలంగాణ జలసిరి,బోర్ వెల్, రీఛార్జ్ పని ప్రారంభించిన సర్పంచ్, సరోజ అంజిరెడ్డి,ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, ఎంపీవో రఫీ, ఏ పి వో వెంకన్న,, ఈ సి ప్రవీణ్,టెక్నికల్ అసిస్టెంట్ సుచరిత, పంచాయతీ కార్యదర్శి అయ్యప్ప రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం కొరకు 1,50,000 ఎల్ఓసిని అందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయంలో లబ్ధిదారునికి అందజేసిన బిఆర్ఎస్ నాయకులు**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 28:** షాద్ నగర్ పట్టణంలోని రామ్ నగర్ కాలనీ కి చెందిన ఓరగంటి ముత్యాలు అత్యవసర వైద్య సహాయార్థం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని సహాయం కోరక స్పందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మెరుగైన వైద్య చికిత్స కొరకు తన సిఫారసుతో 1,50,000 ఎల్ఓసిని మంజూరు చేయించారు.ఈ సందర్భంగా లబ్ధిదారునికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయం షాద్ నగర్ కౌన్సిలర్ వాణి పాండురంగారెడ్డి మాజీ కౌన్సిలర్ నందకిషోర్ చేతుల మీదుగా లబ్ధిదారునికి అందజేశారు.ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ నాయకులు ఓరగంటి రవీందర్,ఎల్లయ్య బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ డివిజన్‌లో ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్ల పరిశీలన

**- రోడ్డు ప్రమాదాలపై పోలీసుల ప్రత్యేక దృష్టి.. బ్లాక్ స్పాట్ల తనిఖీ**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 28:** రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రయాణికుల భద్రతను మెరుగుపరచే లక్ష్యంతో షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రమాదకర బ్లాక్ స్పాట్లను పోలీసు అధికారులు, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు మంగళవారం సంయుక్తంగా పరిశీలించారు.చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణతో పాటు షాద్‌నగర్, నందిగామ, శంషాబాద్ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, ఎన్‌హెచ్ఏఐ ఇంజనీర్ భాను ప్రతాప్ శర్మ, సంబంధిత కాంట్రాక్టర్ ప్రతినిధులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.శంషాబాద్, కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించిన అధికారులు, ప్రమాదాలకు దారితీసే కారణాలను గుర్తించి, హెచ్చరిక బోర్డులు, రహదారి సూచికలు, స్పీడ్ నియంత్రణ చర్యలు, లైటింగ్ తదితర భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను త్వరితగతిన అమలు చేయడంతో పాటు, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని రహదారి భద్రతను మరింత బలోపేతం చేస్తామని కొత్తూరు సీఐ నర్సయ్య తెలిపారు. ఈ చర్యలతో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలంగాణ జలసిరితో భూగర్భ జలాల పెంపునకు గ్రామస్థులందరూ భాగస్వాములు కావాలి: సర్పంచ్ లావణ్య రమేష్

**ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టి భవిష్యత్తును కాపాడుదాం జలసిరి అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ పిలుపు**

**మోత్కులగూడలో తెలంగాణ జలసిరి అవగాహన కార్యక్రమం నీటి సంరక్షణపై గ్రామస్థులకు దిశానిర్దేశం**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 28:** వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించేందుకు అందరూ కలిసి కృషి చేయాలని మోత్కులగూడ గ్రామ సర్పంచ్ జెట. లావణ్య రమేష్ పిలుపునిచ్చారు.నందిగామ మండలం మోత్కులగూడ గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం సర్పంచ్ జెట.లావణ్య రమేష్ ఆధ్వర్యంలో "తెలంగాణ జలసిరి" పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జలసిరి ప్రచార పోస్టర్లను ఆవిష్కరించి గ్రామస్థులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు.సర్పంచ్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే వర్షపు నీటిని నిల్వ చేసుకునే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ జలసిరి పథకంలో భాగంగా ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊటకుంటలు, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు."ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుదాం భవిష్యత్తును కాపాడుదాం" అనే నినాదంతో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, ప్రతి రైతు పొలంలో పంట కుంటలు ఏర్పాటు చేసుకునేలా గ్రామస్థులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ కొనసాగించాలి

**గౌరవ వేతనం, వార్డు సభ్యులకు పారితోషికం కల్పించాలి**

**కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన ఉప సర్పంచ్‌లు**





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 28:** ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌పై వస్తున్న ఆరోపణలను ఖండించాలని, పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం ఉప సర్పంచ్‌లకు కల్పించిన చెక్ పవర్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉప సర్పంచ్‌ల ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బోట్ల కార్తీక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్ ల పిలుపు మేరకు షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్కయ్య గోవర్ధన్ రెడ్డి, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు ముక్కుపోగుల ప్రకాష్ గౌడ్, షాద్‌నగర్ జనరల్ సెక్రటరీ జి.అభినవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ఉప సర్పంచ్‌లు ఎంతో కృషి చేస్తున్నారని, వారి సేవలను గుర్తించి నెలకు ₹5,000 గౌరవ వేతనం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే వార్డు సభ్యులకు నెలకు ₹3,000 గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. గ్రామ సర్వసభ్య సమావేశాల్లో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు పూర్తి స్థాయిలో పాల్గొనే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌ను కొనసాగించడం ద్వారా గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయని వారు పేర్కొన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్ నాయక్, గౌరవ అధ్యక్షుడు రాలబండి శివకుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు టి.రోహిత్, జి.బాలరాజ్, ఇ.యాదగిరి రెడ్డి, కార్యవర్గ సభ్యులు కె.విజయ్ కుమార్, నందిగామ మండల అధ్యక్షుడు శివశంకర్, చౌదరిగూడ మండల అధ్యక్షుడు డి.గణేష్, కొత్తూరు మండల అధ్యక్షుడు ఆరోగ్యం, కేశంపేట మండల అధ్యక్షుడు షకీల్, సున్నాల గణేష్, శ్రీనివాసలగూడ గోపాల్ రెడ్డి, సి.ప్రభాకర్, చిర్ర లక్ష్మయ్య, జే.మల్లేష్, యారం రాంరెడ్డి, హేశ్వరం మండల అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, మంచాల మండల అధ్యక్షుడు యాదగిరి, కడ్తాల్ మండల అధ్యక్షుడు లక్పతి నాయక్‌తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ మున్సిపాలిటీలో 64.39 శాతం ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తి

**షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి**

**నిజమైన ఓటర్లకు అన్యాయం జరగకుండా**

**ఎస్ఐఆర్ ప్రక్రియకు సహకరించాలి**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 28:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా షాద్‌నగర్ మున్సిపాలిటీలో ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందని మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి తెలిపారు. ఇప్పటివరకు మున్సిపాలిటీ పరిధిలో 64.39 శాతం ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని ఆమె వెల్లడించారు. మంగళవారం పట్టణంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులతో ఆమె మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 53,586 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 34,502 మంది ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. ఇంకా 11,881 మంది ఓటర్ల డిజిటలైజేషన్ పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. అలాగే 7,203 మంది ఓటర్లు యూఈఎఫ్ కేటగిరీలో ఉన్నట్లు నివేదికలో నమోదైందని వివరించారు. మొత్తం మీద మున్సిపాలిటీ పరిధిలో 77.83 శాతం ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. నిజమైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు సక్రమంగా డిజిటలైజేషన్ అయ్యేలా ప్రజలు సహకరించాలని కమిషనర్ సునీతారెడ్డి కోరారు. పట్టణ కౌన్సిలర్లు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని ఓటర్లకు అవగాహన కల్పించి, పెండింగ్‌లో ఉన్న డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు దక్కేలా చూడటమే లక్ష్యమని, ఇందుకోసం అధికారులు, సిబ్బంది ప్రజలకు అవసరమైన సహకారం అందించేందుకు అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటారని ఆమె తెలిపారు. ఓటర్లు ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించి తమ వివరాలను సరిచూసుకుని డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నలమోని శ్రీధర్, కౌన్సిలర్లు ఎస్పీ శివ, కొప్పుల ప్రవీణ్‌కుమార్, సీనియర్ నేత ముబారక్ అలీఖాన్, కౌన్సిలర్లు రాజు నాయక్, పెంటయ్య, మహిళా కౌన్సిలర్లు లక్ష్మీ ప్రసన్న, వేణుగోపాల్, స్థానిక నాయకులు పిల్లి శేఖర్, చీపిరి రవి యాదవ్ తదితర నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# బోనాల సంప్రదాయాన్ని భావితరాలకు చాటేలా చిన్నారుల అద్భుత నృత్య రూపకం

- కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి
- కొరియోగ్రాఫర్ రాజు మాస్టర్ సత్తా నాకు తెలుసు - జర్నలిస్ట్ కేపీ
- షాద్‌నగర్‌లో "జోగు చెప్పే జోగులాంబవే" పాట విడుదల..





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 28:** తెలంగాణ సంస్కృతి, బోనాల సంప్రదాయాన్ని భావితరాలకు చేరవేసే లక్ష్యంతో రూపొందించిన "జోగు చెప్పే జోగులాంబవే" పాటను మంగళవారం షాద్‌నగర్‌లోని ఆహా హోమ్ థియేటర్‌లో ఘనంగా విడుదల చేశారు. కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ ఎం.డి. ఖాజా పాషా (కేపీ) చేతుల మీదుగా పాట ఆవిష్కరణ జరిగింది. ప్రముఖ సినీ, బుల్లితెర కొరియోగ్రాఫర్ కోనేటి రాజు మాస్టర్ దర్శకత్వం, కొరియోగ్రఫీలో రూపొందిన ఈ నృత్య రూపకంలో ఐదు నుంచి పది సంవత్సరాల మధ్య వయస్సున్న చిన్నారులు అమ్మవార్లు, పోతురాజుల వేషధారణలో అద్భుతంగా అలరించారు. ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహోత్సవమని, ఇలాంటి సంప్రదాయాలను చిన్నారుల ద్వారా భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ కేపీ మాట్లాడుతూ రాజు మాస్టర్ ప్రతిభను కొనియాడుతూ, ప్రాంతీయ ప్రతిభను వెలికితీసేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాజు మాస్టర్ మాట్లాడుతూ బోనాల చరిత్ర, ఆధ్యాత్మికత, జానపద వైభవాన్ని చిన్నారుల నృత్య రూపకం ద్వారా ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ పాటను రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమం ముగింపులో చిన్నారులు, వారి తల్లిదండ్రులు, ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ నృత్య రూపకం ప్రేక్షకుల నుంచి విశేష ప్రశంసలు అందుకుంది.

# మత్తుకు దూరం.. భవిష్యత్తుకు మార్గం

- జీవితాలను నాశనం చేసే మత్తు సంస్కృతి
- ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి
- డ్రగ్స్ ఉచ్చులో పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు
- ఉప్పల్ ఎస్‌హెచ్‌ఓ (సిఐ) రామలింగారెడ్డి
- ఉప్పల్ పాలిటెక్నిక్ కళాశాలలో యాంటీ-డ్రగ్ అవగాహన సదస్సు
- వెయ్యి మంది విద్యార్థుల భాగస్వామ్యంతో శపథం




ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి



ఉప్పల్ ఎస్‌హెచ్‌ఓ (సిఐ) రామలింగారెడ్డి

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),జూలై28:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాల సాధన వైపే అడుగులు వేయాలని ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి,ఎస్‌హెచ్‌ఓ (సిఐ) రామలింగారెడ్డి పిలుపునిచ్చారు. ఉప్పల్ పోలీసు స్టేషన్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా,ఎస్‌హెచ్‌ఓ రామలింగారెడ్డి విశిష్ట అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ అవగాహన సదస్సులో సుమారు 1000 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తు అని అన్నారు. సరదాగా మొదలయ్యే అలవాట్లు వ్యసనంగా మారి జీవితాలను నాశనం చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి,డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే తీవ్ర ఆరోగ్య సమస్యలు, మానసిక కుంగుబాటు,కుటుంబాలు ఎదుర్కొనే వేదనలను విద్యార్థులకు వివరించారు. చదువుకునే వయసులో లక్ష్యాలపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు.

## చట్టపరమైన చర్యలు తప్పవు: ఎస్‌హెచ్‌ఓ రామలింగారెడ్డి

ఎస్‌హెచ్‌ఓ రామలింగారెడ్డి మాట్లాడుతూ..మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంలో భాగస్వాములైనా, సరఫరా చేసినా చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డ్రగ్స్ కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తులో ఉద్యోగాలు,పాస్‌పోర్టులు రాక జీవితం అంధకారమవుతుందని స్పష్టం చేశారు. కళాశాలల్లో, పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ రహిత వాతావరణాన్ని సృష్టించడంలో ప్రతీ విద్యార్థి ఒక బాధ్యతాయుత పౌరుడిగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

## సమాచారం ఇవ్వండి - రహస్యంగా ఉంచుతాం:

మీ చుట్టుపక్కల ప్రాంతాల్లో లేదా కళాశాల పరిసరాల్లో ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 కి గానీ, లేదా నేరుగా ఉప్పల్ పోలీసులకు గానీ సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మితికి విద్యార్థులందరూ ప్రతిజ్ఞ చేస్తూ, సమాజంలో విస్తృత అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ స్టేషన్ పోలీస్ అధికారులు, సిబ్బంది, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్,ప్రొఫెసర్‌లు పాల్గొన్నారు.




# ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం అవసరం

- ఆగస్టు 3లోగా పెండింగ్ ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయాలి: షాద్‌నగర్ తహసీల్దార్ నాగయ్య





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 28:** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఓటర్ల మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని షాద్‌నగర్ తహసీల్దార్ చెన్న నాగయ్య కోరారు. షాద్‌నగర్‌లో నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. షాద్‌నగర్ రూరల్ పరిధిలో 2,294 మంది ఓటర్లకు సంబంధించిన ప్రక్రియ ప్రస్తుతం పెండింగ్‌లో ఉందని, ఆయా ఓటర్ల మ్యాపింగ్ పూర్తయ్యేలా రాజకీయ పార్టీల నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు సహకరించాలని తహసీల్దార్ సూచించారు. ఈ ప్రక్రియను ఆగస్టు 3వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. అదేవిధంగా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 28 పోలింగ్ స్టేషన్లలో 100 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాజకీయ పార్టీల నుంచి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, బీఎస్పీ నాయకుడు దొడ్డి శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త బాధ్యతలు.. మరింత ప్రజా సేవ!

**- ఎం.డి.ఇబ్రహీం ను అభినందించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 28:** అధిష్టానం నమ్మకం.. నాయకుల ఆశీస్సులు, కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా అడుగులు వేస్తూ ప్రజా సమస్యల పోరాటంలో మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ.. కాంగ్రెస్ కమిటి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఇబ్రహీంకు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎం.డి. ఇబ్రహీం మంగళవారం మాజీ ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన పదవి లభించినందుకు మాజీ ఎమ్మెల్యే శాలువా తో సన్మానించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఇబ్రహీం నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో ఇబ్రహీం రాజకీయంగా మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని, నియోజకవర్గంలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ఆశీర్వదించారు. అనంతరం ఇబ్రహీం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన పార్టీ అధిష్టానానికి, అండగా నిలిచిన నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం, ప్రజల శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కలయికలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీనియర్ సినీ నటి పావలా శ్యామల కన్నుమూత




ప్రముఖ సినీ నటి, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అర్ధరాత్రి దాటాక తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.
దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన సినీ ప్రయాణంలో పావలా శ్యామల 250కి పైగా చిత్రాలలో నటించారు. 1985లో వచ్చిన 'బాబాయ్ అబ్బాయ్' చిత్రంతో వెండితెరకు పరిచయమైనప్పటికీ, కె. విశ్వనాథ్ దర్శకత్వంలోని 'స్వర్ణకమలం' సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత 'ఖడ్గం', 'ఆంధ్రావాలా', 'అతడు', 'గోలీమార్' వంటి అనేక విజయవంతమైన చిత్రాల్లో తనదైన సహజ నటనతో, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించారు.
ఏపీలోని గుంటూరు జిల్లా అమరావతిలో 1951లో జన్మించిన శ్యామల అసలు పేరు నేతి శ్యామల. నటనపై ఆసక్తితో తొలుత రంగస్థల నటిగా, రేడియో ఆర్టిస్ట్‌గా ప్రస్థానం ప్రారంభించారు. ఆమె నటించిన 'పావలా' అనే నాటకం విశేష ప్రజాదరణ పొందడంతో అదే ఆమె ఇంటిపేరుగా స్థిరపడిపోయింది. తన అమాయకత్వంతో కూడిన నటనతో తెలుగు ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేశారు. ఆమె మరణవార్తతో తెలుగు సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది.

# రామ్ చరణ్ కి సర్జరీ సక్సెస్..

## వైద్య బృందంతో ఆకట్టుకుంటున్న స్పెషల్ ఫోటో!



ప్రముఖ డైరెక్టర్ బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రామ్ చరణ్ ఇటీవల నటించిన రూరల్ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ మూవీ పెద్ది. బాలీవుడ్ బ్యూటీ జాన్వి కపూర్ హీరోయిన్ గా నటించింది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా రూ.400 కోట్ల క్లబ్లో చేరి సంచలన విజయం అందుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో ఆయన చేతి మణికట్టు వద్ద గాయమైంది. అయితే ఆ గాయం కారణంగా సినిమా షూటింగ్ నిలిపివేయకుండా ప్రమోషన్స్ లో కూడా పాల్గొని సినిమా పట్ల తనకున్న నిబద్ధతను నిరూపించుకున్నారు. ప్రస్తుతం విరామం దొరకడంతో తన భార్య ఉపాసన , తల్లిదండ్రులు మెగాస్టార్ చిరంజీవి, సురేఖ కొణిదెలతో కలిసి కోయంబత్తూర్ కి బయలుదేరిన రామ్ చరణ్ గంగా హాస్పిటల్ లో ప్రముఖ వైద్య బృందం సమక్షంలో సర్జరీ చేయించుకున్నారు. కొత్తసినిమాలు ఈ మేరకు సర్జరీ విజయవంతం అయింది. ఈ విషయాన్ని పెద్ది మూవీ మేకర్స్ అధికారికంగా దిగ్గజ వైద్య నిపుణులతో రామ్ చరణ్ కలిసి దిగిన ఫోటోని ప్రత్యేకంగా పంచుకుంటూ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "పెద్ది సినిమా షూటింగ్ సమయంలో రాంచరణ్ గాయపడినప్పటికీ నొప్పిని భరిస్తూ కీలకమైన సన్నివేశాల షూటింగ్ ను పూర్తి చేశారు. ఆయన వృత్తిపట్ల చూపిన అంకితభావం ఎంతో స్ఫూర్తిదాయకం" అని వృద్ధి సినిమాస్ కూడా పేర్కొంది. త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని చిత్ర బృందం ఆకాంక్షించింది. ఈ మేరకు పంచుకున్న ఫోటోలో రామ్ చరణ్ తో పాటు చేతి మణికట్టు వైద్య నిపుణులు అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎస్ రాజశేఖరన్, అంతర్జాతీయంగా పేరుపొందిన యూఎస్ మియామీకి చెందిన మణికట్టు స్పెషలిస్ట్ డాక్టర్ అలెంజాడ్రో బాడియా, డాక్టర్ ప్రవీణ్ భరద్వాజ్ లు.. సర్జరీ అనంతరం బెడ్ పై ఉన్న రామ్ చరణ్ తో కలిసి దిగిన ఫోటో ఇప్పుడు అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది. నిపుణుల సమక్షంలో ఆయనకు సర్జరీ దిగ్విజయంగా పూర్తయిన సందర్భంగా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తూ.. వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఇటు రాంచరణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిసున్నారు.



## స్టన్నింగ్ మేకోవర్ : అగ్గి రాజేసిన రాశీ ఖన్నా లేటెస్ట్ ఫోటోషూట్


టాలీవుడ్, బాలీవుడ్‌లలో తనదైన నటన - గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక రాశీ ఖన్నా. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ అందాల భామ... తన లేటెస్ట్ ఫోటోషూట్‌లతో అభిమానులను అలరిస్తుంటుంది. తాజాగా రాశీ తన ఇన్‌స్టాగ్రామ్ లో షేర్ చేసిన బ్లాక్ అండ్ బోల్డ్ లుక్ ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. నలుపు రంగు దుస్తుల్లో రాశీ ఖన్నా ఒలికించిన సొగసులు అభిమానులను, నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రత్యేకమైన ఫోటోషూట్ కోసం ఈ ఢిల్లీ బ్యూటీ ధరించిన అవుట్‌ఫిట్... మేకప్ తన అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఫర్ యువర్ రిఫరెన్స్! అనే క్యాప్షన్‌తో పాటు తన స్టైలిస్ట్ శీఫా జే గిలానీ, మేకప్, హెయిర్ అండ్ ఫొటోగ్రఫీ టీమ్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ -టేక్స్ ఏ విలేజ్-అని పోస్ట్ చేశారు. బ్లాక్ డ్రెస్‌లో రాజసం ఉట్టిపడేలా రాశీ ఇచ్చిన ఫోజులు, స్టైలింగ్ న భూతో నభవిష్యతి అన్నట్లుగా ఉన్నాయని అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ ఫోటోలు పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందాల రాశీఖన్నా అభిమానులు, నెటిజన్లు వేల సంఖ్యలో లైకులు, కామెంట్లతో రీ-పోస్ట్‌లు చేస్తున్నారు.-నలుపు రంగు ఇంత అందంగా ఎప్పుడూ లేదు-, -బాలీవుడ్, టాలీవుడ్‌లలో ఒక కొత్త సంచలనం-,-10 అవుట్ ఆఫ్ 10- అంటూ నెటిజన్లు కామెంట్ల సెక్షన్‌లో హార్ట్, ఫైర్ ఎమోజీలతో రాశీ గ్లామర్‌ను ఆకాశానికెత్తేస్తున్నారు. గత కొన్ని రోజులుగా విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తన యాక్టింగ్ స్కిల్స్‌తో మెప్పిస్తున్న రాశీ ఖన్నా, ఇలాంటి ఫ్యాషన్ షూట్స్‌తో తన గ్లామర్ కోణాన్ని కూడా ఆవిష్కరిస్తోంది. ట్రెండ్‌కు తగ్గట్లుగా పర్ఫెక్ట్ ఫ్యాషన్ సెన్స్‌తో కనిపిస్తూ కుర్రకారు హృదయాలను కొల్లగొడుతోంది. ముఖ్యంగా యువతలోఈ బ్యూటీకి ఉన్న క్రేజ్ ఈ ఫోటోలకు వస్తున్న రెస్పాన్స్ చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది.

## 'అబ్జెక్షన్ మై లార్డ్'ను చిరంజీవి మెచ్చుకున్నారు... చాలా హ్యాపీ!: శ్రీకాంత్



"మా 'అబ్జెక్షన్ మై లార్డ్' సిరీస్‌ను చూసి మెగాస్టార్ చిరంజీవిగారు చాలా బాగుందని మెచ్చుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది" అని ప్రముఖ నటుడు శ్రీకాంత్ అన్నారు. జీ5 ఓటీటీ వేదికగా రానున్న ఈ ఒరిజినల్ సిరీస్ ప్రివ్యూ ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని పంచుకున్నారు. శ్రీకాంత్, అనన్య శర్మ, ముఖేష్ రిషి, స్నేహాల్, సమీర్ ప్రధాన పాత్రలలో నటించిన ఈ సిరీస్‌కు 'నోటరీ పరశురాం' అనేది ట్యాగ్‌లైన్. 7 ఎపిసోడ్ల ఎమోషనల్ కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందిన ఈ సిరీస్ జూలై 31 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది. డ్రీమ్ హౌస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్‌కుమార్ ఆకెళ్ల నిర్మించగా, సంతోష్ అయ్యప్పన్ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, "జీ5తో నాకు మంచి అనుబంధం ఉంది. వారితో ఇది నా మూడో వెబ్ సిరీస్. సినిమాల కన్నా సిరీస్‌లకు ఎక్కువ కష్టపడాలి, కానీ చాలా ఎంజాయ్ చేస్తూ పనిచేశాను. ఇందులో నాకు మంచి పాత్ర దొరికింది. దర్శకుడు సంతోష్ చాలా క్లారిటీతో ఈ సిరీస్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారు. నిర్మాత రాజ్ కుమార్ ఎక్కడా రాజీ పడకుండా సపోర్ట్ చేశారు. సిరీస్ అవుట్‌పుట్ చూశాక మేమంతా ఫిదా అయ్యాం. ముఖేష్ రిషి గారు కేవలం నటుడే కాదు, స్వచ్ఛమైన మనసున్న వ్యక్తి. ఈ సిరీస్ కోసం అందరూ ఎంతో కష్టపడ్డారు. చిరంజీవి గారు కూడా చూసి బాగుందని చెప్పడంతో మా కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కినట్లయింది" అని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.నటుడు ముఖేష్ రిషి మాట్లాడుతూ, "ఈ సిరీస్ కోసం శ్రీకాంత్ గారు రోజుకు 18 గంటలు పనిచేశారు. ఆయన డెడికేషన్ అమోఘం. జూలై 31న కుటుంబంతో కలిసి ఈ సిరీస్‌ను చూడండి" అని కోరారు. మరో నటుడు సమీర్ మాట్లాడుతూ, "ఇది వెబ్ సిరీస్ కాదు, ఒక వెబ్ ఫిలిం. శ్రీకాంత్ లాంటి ప్రొడ్యూసర్స్ హీరో లేకపోతే ఇది పూర్తయ్యేది కాదు. ఆయన ఒక డైరెక్టర్స్ యాక్టర్. జూలై 31న ప్రేక్షకులు ఒక విజువల్ ఫీస్ట్ చూడబోతున్నారు" అని అన్నారు.దర్శకుడు సంతోష్ అయ్యప్పన్ మాట్లాడుతూ, "ఈ సిరీస్ షూటింగ్‌ను కేవలం 19 రోజుల్లో పూర్తి చేశాం. శ్రీకాంత్ గారు, ముఖేష్ రిషి గారు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారం వల్లే ఇది సాధ్యమైంది. నిర్మాత రాజ్ కుమార్, జీ5 టీమ్ ఇచ్చిన స్వేచ్ఛతోనే ఇంత వేగంగా, నాణ్యంగా సిరీస్‌ను పూర్తి చేయగలిగాం" అని తెలిపారు.

## ఓటీటీలోకి వస్తున్న సత్యదేవ్ 'రావు బహదూర్'..




టాలీవుడ్ హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో, ప్రశాంత్ కుమార్ డి దర్శకత్వంలో తెరకెక్కిన పీరియడ్ సోషల్ డ్రామా 'రావు బహదూర్' డిజిటల్ విడుదల తేదీ ఖరారైంది. సినీ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో జులై 31 నుంచి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి రానుంది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతోంది. సూపర్ స్టార్ మహేశ్ బాబుకు చెందిన జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కింది.
థియేటర్లలో విడుదలైన సమయంలో ఈ సినిమా వైవిధ్యమైన కథాంశం, సత్యదేవ్ బలమైన నటన, సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మంచి స్పందనను సొంతం చేసుకుంది. సత్యదేవ్ ప్రదర్శించిన నటన, దర్శకుడు మలిచిన ఉత్కంఠభరితమైన కథనం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ ద్వారా ఓటీటీలోకి వస్తుండటంతో ఈ సినిమా మరింత ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ కోబోతోంది.



## 'ఆదర్శ కుటుంబం'లో నివేదా పేతురాజ్.. స్పెషల్ గ్లింప్స్‌తో సర్‌ప్రైజ్ ఇచ్చిన మేకర్స్

విక్టరీ వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ నివేదా పేతురాజ్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ విడుదల చేసిన ప్రత్యేక గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది.
మొదట నివేదా పేతురాజ్ ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తలకు చెక్ పెడుతూ మేకర్స్ విడుదల చేసిన గ్లింప్స్‌లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్పష్టం చేశారు. వీడియోలో వెంకటేశ్ సరదా డైలాగ్‌లతో ఆకట్టుకోగా, నివేదా చిరునవ్వుతో ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు.గ్లింప్స్‌లో వెంకటేశ్ ఇంటి నుంచి కోపంగా బయటకు వచ్చి, నేటి మహిళలపై సరదాగా వ్యాఖ్యలు చేస్తారు. అదే సమయంలో ఎదురుగా నివేదా పేతురాజ్ నవ్వుతూ కనిపించడంతో, "ఆడది అంటే ఇలా నవ్వాలి" అంటూ తన భార్య గురించి వెంకటేశ్ చెప్పే కామెడీ డైలాగ్ నవ్వులు పూయిస్తుంది. చివర్లో కమెడియన్ సత్య వచ్చి "ఊరుకో నాయనా.. ఇది మన ఆదర్శ కుటుంబం" అని చెప్పడంతో వీడియో ముగుస్తుంది.ఈ చిత్రంలో శ్రీనిధి స్వర్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్‌ను బట్టి చూస్తే నివేదా పేతురాజ్ పాత్రకు కూడా కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ కెరీర్‌లో ఇది 77వ చిత్రం కాగా, నారా రోహిత్ మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.




## అభిమానులతో ప్రత్యేకంగా సమావేశమైన అల్లు అర్జున్.. ఫ్యాన్స్ కు కీలక సూచన!

నెట్టింట సాగే దుష్ప్రచారాలకు దూరంగా ఉండాలని అభిమానులకు బన్నీ హితవు
పాన్ ఇండియా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హైదరాబాద్‌లో తన అభిమానులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. యూసుఫ్‌గూడలోని శౌర్య భవన్‌లో 'అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్'ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 600 మందికి పైగా అభిమానులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన బన్నీ... సోషల్ మీడియాలో వ్యక్తమయ్యే అనవసరపు ట్రోల్స్, నెగెటివిటీపై పరోక్షంగా స్పందించారు. నెట్టింట సాగే దుష్ప్రచారాలను, వివాదాలను అస్సలు పట్టించుకోవద్దని అభిమానులకు హితవు పలికారు. సానుకూల ధోరణితో ముందుకెళుతూ, తమ సమయాన్ని, శక్తిని మంచి కార్యాలకే వినియోగించాలని పిలుపునిచ్చారు.అభిమానులు చూపుతున్న అమితమైన ఆప్యాయతకు బన్నీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వారితో కలిసి గ్రూప్ ఫోటోలు దిగుతూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. నెగెటివిటీకి దూరంగా ఉండాలని అల్లు అర్జున్ ఇచ్చిన సందేశానికి సోషల్ మీడియాలోనూ ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ సమావేశంతో అభిమానులకు, ఐకాన్ స్టార్‌కు మధ్య ఉన్న అనుబంధం మరింత బలపడింది.